# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..


https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 55 7-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06









## ప్రాజెక్టుల నాణ్యతలో రాజీ పడొద్దు

### దెబ్బతిన్న పోలవరం డయాఫ్రం వాల్ స్థానంలో కొత్తది నిర్మించాలని నిర్ణయం

- నిపుణుల నివేదికలు ఉన్నప్పటికీ.. ప్రజా భద్రతకే ప్రాధాన్యత అని వెల్లడి
- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను వెంటేసుకుని తిరగడం దారుణం అంటూ ఫైరర్
- ఏడుకొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే కుట్రలు మొదలు అని ఆరోపణ
- పోస్టుమార్టానికి కారకులైన వారే పరామర్శలకు వెళు తున్నారని వ్యాఖ్యలు

ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం, వెలిగొండ, హంద్రీ-నీవా, చింతలపూడి లిఫ్ట్ సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిపై ఆయన అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయాన్ని

- మిగతా 2వ పేజీలో

# ఖమేనీ బంకర్ ధ్వంసం

- 50 యుద్ధ విమానాలతో దాడి చేశామన్న ఇజ్రాయెల్
- అది సైనిక మిలిటరీ కమాండ్ సెంటరని వెల్లడి
- పశ్చిమాసియాలో ఏడో రోజూ నిప్పుల వాన
- భారీగా ఇజ్రాయెల్, అమెరికా దాడులు
- తీవ్రస్థాయిలో ఇరాన్ ప్రతి దాడులు
- తీవ్రత మరింత పెంచుతాం: ట్రంప్
- ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందాలూ ఉండవ్
- బేషరతుగా లొంగిపోవాల్సిందేనన్న అధ్యక్షుడు
- తగ్గేదే లేదు.. భూతల దాడులకూ సిద్ధం: ఇరాన్



దుబాయ్/బీరూట్: పశ్చిమాసియాలో కల్లోల తీవ్రత ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఏడో రోజైన శుక్రవారం కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భారీ స్థాయిలో దాడులు కొనసాగించాయి. నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలను ప్రధానంగా లక్ష్యం చేసుకున్నాయి. ఇరాన్‌వ్యాప్తంగా క్షిపణులు, బాంబుల వర్షం కురిసింది. దాడుల తీవ్రతను ఇకపై మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు ఘాటు హెచ్చరికలు చేశారు. ఆ దేశంతో ఎలాంటి ఒప్పందాలూ, చర్చలూ ఉండబోవని స్పష్టం చేశారు. "బేషరతుగా లొంగిపోవాలి. వారి ముందున్న మార్గం అదొక్కటే"అంటూ కుండబద్దలు కొట్టారు. ఇరాన్ మాత్రం ఏ మాత్రమూ వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని పేర్కొంది. భూతల దాడులకు కూడా తాము అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ

- మిగతా 2వ పేజీలో




## ముందుంది 'యుద్ధ గండం'

- ఇరాన్ యుద్ధం సెప్టెంబర్ దాకా కొనసాగే అవకాశం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై స్వదేశంలో మొదలైన అసంతృప్తి
- మిడ్‌టర్మ్ ఎన్నికల్లో చేదు ఫలితాలు వస్తే ఆయన దిగిపోక తప్పదంటున్న విశ్లేషకులు

2లో



## రాజ్యసభకు తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవం!

- పెద్దల సభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణతో సులువైన ఎన్నిక
- గడువు తర్వాత లాంఛనంగా ప్రకటించనున్న అధికారులు



## అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పరుగులు

- ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా మారనున్న నగరం
- కొత్వాల్‌గూడ ఎకోపార్కును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మాణానికి శంకుస్థాపన

2లో

శంషాబాద్: ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన గొప్ప నగరంగా హైదరాబాద్ అవతరించనుందని, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, ట్రంప్, ఎలాన్ మస్క్ వంటి వారి సంస్థలు హైదరాబాద్‌కు రాబోతున్నాయని, ప్రపంచంతోనే పోటీపడే నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించిన కొత్వాల్‌గూడ ఎకోపార్కును ఆయన శుక్రవారం ప్రారంభించారు. బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఈ కార్యక్రమంలో

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది




- అసెంబ్లీలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ
- తాజా బడ్జెట్ 5 కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమన్న పవన్
- వైసీపీ హయాంలో విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని వెల్లడి

2లో

## ఇకపై పొరపాట్లు జరగవు.. గతం గతః



- కొలికపూడి, కేశినేని చిన్ని మధ్య కొంత కాలంగా విభేదాలు
- తన వల్ల పార్టీకి ఇబ్బంది కలిగినందుకు కొలికపూడి విచారం
- కులం కార్డు వాడటం తన అభిమతం కాదని స్పష్టీకరణ



## మన టాప్ ర్యాంక్ 23

- వీసివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల టాప్ ర్యాంకర్‌గా శ్రీజశ్వంత్‌చంద్ర
- 55వ ర్యాంకు సాధించిన పెద్దపల్లికి చెందిన సృజన
- జోధ్‌పూర్ ఎంబీబీఎస్ వైద్యుడు అనూజ్ అగ్నిహోత్రికి ఫస్ట్ ర్యాంక్
- చెన్నైకి చెందిన రాజేశ్వరి సువేకు రెండో ర్యాంక్..
- ఢిల్లీవాసి ఆకాన్ష్ ధుల్‌కు మూడో ర్యాంక్
- సివిల్స్2025 తుది ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ

హైదరాబాద్: సివిల్స్2025 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ఏపీలోని కాకినాడకు చెందిన జీను శ్రీజశ్వంత్‌చంద్ర ఆలిండియా 23వ ర్యాంక్ సాధించగా తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన గూడెల్లి సృజన 55వ ర్యాంకు సాధించారు. తెలంగాణకు చెందిన 20 మందికి వెయ్యిలోపు ర్యాంకులు

2లో

## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు

- కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై హరీశ్ రావు విమర్శలు
- గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టల్లోనే ఉన్నాయని వెల్లడి
- రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతలను నడిరోడ్డుపైకి తెచ్చారని ఆగ్రహం
- పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పాకులాడుతున్నారని మండిపాటు



## ఇకపై పొరపాట్లు జరగవు.. గతం గతః

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా టీడీపీలో సాగుతున్న రాజకీయ వివాదాలకు తెరపడినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో, ఈరోజు అసెంబ్లీ లాబీల్లో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుని కొలికపూడి కలిశారు. నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు, పార్టీ ప్రతిష్ఠపై పడుతున్న ప్రభావంపై వీరు చర్చించారు. అనంతరం మీడియాతో పల్లా మాట్లాడుతూ కొలికపూడికి తాను చెప్పాల్సింది చెప్పానని అన్నారు. అనంతరం కొలికపూడి మాట్లాడుతూ... గతంలో జరిగిన పొరపాట్లు ఇకపై పునరావృతం కావని, 'గతం గతః' అని ఆయన స్పష్టం చేశారు. తన చర్యల వల్ల పార్టీకి ఇబ్బంది కలిగినందుకు విచారం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో నియోజకవర్గ ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తానని, ఆయన నుంచి కూడా అదే ఆశిస్తానని తెలిపారు. అలాగే, తన చుట్టూ ఉన్న కొందరు వ్యక్తుల వల్ల లేదా ఎంపీ అనుచరులు కొందరి వల్ల ఈ సమస్యలు తలెత్తి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, ఆ విధానానికి తాను పూర్తిగా వ్యతిరేకమని కొలికపూడి స్పష్టం చేశారు. ఇకపై నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా నేరుగా జోనల్ కోఆర్డినేటర్ లేదా జిల్లా పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటానని హామీ ఇచ్చారు.

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో జరిగిన 'ఆర్థిక విధ్వంసం' కారణంగా రాష్ట్రం దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సామాజిక భద్రతా పెన్షన్ల కోసమే రూ. 33 వేల కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయమని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో అనాలోచిత విద్యుత్ కొనుగోళ్ల వల్ల డిస్కంలకు రూ. 12,250 కోట్ల నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ట్రూడౌన్' పేరిట ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామని పవన్ చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల అప్పులను, రూ. 35 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని విమర్శించారు. ఇందులో ఇప్పటికే రూ. 25 వేల కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడం వల్ల రూ. 8,700 కోట్ల కేంద్ర నిధులు నిరుపయోగమయ్యాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించి ఇంటింటికీ మంచినీరు అందించే ప్రాజెక్టును వేగవంతం చేస్తోందని వివరించారు. "నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదు.. భావితరాల కోసం" అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తిని ఉటంకిస్తూ, బడ్జెట్‌లో భావితరాల బాగు కోసం సీఎం చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

### రాజ్యసభకు తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవం!

తెలంగాణ నుంచి ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిల ఎన్నిక లాంఛనంగా మారింది. బరిలో ఉన్న ఏకైక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో వీరికి పోటీ లేకుండా పోయింది. రాజ్యసభ ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థికి 10 మంది ఎమ్మెల్యేలు మద్దతుగా ప్రతిపాదించాల్సి ఉంటుంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన కాంతే సాయన్న నామినేషన్ పత్రాలకు తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు లేదని రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి నిర్ధారించి, దానిని తిరస్కరించారు. మరోవైపు, తగిన సంఖ్యాబలం లేకపోవడంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులిద్దరే బరిలో మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది. ఆ సమయం ముగిసిన వెంటనే, సింఘ్వీ, నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించి, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అయిన అభిషేక్ మను సింఘ్వీకి తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించడం ఇది రెండోసారి. ఇక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయ వ్యూహకర్తగా పేరున్న వేం నరేందర్ రెడ్డి తొలిసారిగా పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు.

## ముందుంది 'యుద్ధ గండం'

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి వారం రోజులవుతోంది. ఈ యుద్ధం పశ్చిమాసియాలో తొమ్మిది దేశాలకు విస్తరించింది. ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించకపోవడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ సైన్యం ఎక్కడా తగ్గకుండా శక్తిమేరకు పోరాడుతోంది. ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలకే లక్ష్యంగా దాడులకు దిగుతోంది. ఈ ఘర్షణ మరింత ముదిరే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సొంతదేశంలో అసంతృప్తి మొదలైనట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ ఘర్షణను త్వరగా ముగించకపోతే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తాయని, చివరకు ట్రంప్‌కు పదవీ గండం తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌ను ఎలాగైనా లొంగదీసుకోవడానికి అమెరికా సైన్యం వనరుల సమకూర్చుకుంటోంది. తమ సైన్యాన్ని, ఆయుధాలను పశ్చిమాసియాకు తరలిస్తోంది. ఈ యుద్ధం మరో ఆరు నెలలకుపైగానే.. అంటే సెప్టెంబర్ దాకా కొనసాగే పరిస్థితి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణిస్తే యుద్ధం ముగిసిపోతుందని, ఇరాన్ తలవంచడం ఖాయమని, అక్కడ ప్రభుత్వం మారిపోతుందని ఇజ్రాయెల్, అమెరికా భావించాయి. కానీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మరొకటి. ఖమేనీ హత్యపట్ల ఇరాన్ ప్రజలు ప్రతీకారంతో రగిలిపోతున్నారు. ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా వారంతా ఒక్కతాటిపైకి వస్తున్నారు. సుదీర్ఘ యుద్ధానికి ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా సైతం సిద్ధమైనట్లే కనిపిస్తోంది. అమెరికా రక్షణ శాఖ ఇరాన్‌లో నిఘా కార్యకలాపాలు ముమ్మరం చేస్తోంది.

# అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, శంషాబాద్ హైస్పీడ్ రైల్ టెర్మినల్, బుద్వేల్ ట్రంపెట్, ఎకో పార్కు వంటి ప్రాజెక్టులు హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా ఆవిష్కరించనున్నాయన్నారు. హైదరాబాద్ కంటే సుందరమైన నగరం దేశంలోనే లేదన్నారు. చంద్రబాబు, వైఎస్ హయాంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించారని, కృష్ణా, గోదావరి నీళ్లు నగరానికి తీసుకొచ్చారని చెప్పారు. మూసీ వరదల నుంచి కాపాడుకునేందుకు నాటి నిజాం నవాబు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లను నిర్మించాడన్నారు. ఉస్మానియా ఆస్పత్రి, గోల్కొండ, అసెంబ్లీ వంటి చారిత్రక కట్టడాలు హైదరాబాద్‌లో ఉన్నాయని చెప్పారు. ఎంతో అందమైన హైదరాబాద్ నగరం ఆక్రమణలు, చెత్తతో నిండిపోయిందని, అలాంటి నగరాన్ని తిరిగి అందంగా, మరింత సుందరంగా చేస్తామంటే ప్రతిపక్షంలో ఉన్నవారు ఒప్పుకోవడం లేదన్నారు. మూసీ మురికిలో బతకాలని ఎవరూ కోరుకోరని, గంగా, యమున నదుల తరహాలో ప్రక్షాళన చేస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు, రేడియల్ రోడ్ల వల్ల భూములు కోల్పోయే వారికి తగిన పరిహారం అందజేస్తామని, వారికి ఎలాంటి నష్టాలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని, ఉత్తమ ప్యాకేజీని అందజేసే బాధ్యత తానే తీసుకుంటానని సీఎం చెప్పారు. నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తుంటే కేటీఆర్ అడ్డుపడుతున్నాడని, చాలాకాలం మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి కూడా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మూసీని నైట్ ఎకానమీ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తామన్నారు. పాలపిట్ట రంగులో ఉన్న ఇందిరమ్మ చీరలు ధరించిన మహిళలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.488 కోట్లు ఖర్చు చేసి ట్రంపెట్‌ను నిర్మించనున్నారు. ఇది ఓఆర్ఆర్‌ను రేడియల్ రోడ్2తో అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టులో మొత్తం లూపులు, ర్యాంపులు 15.36 కిలోమీటర్లు ఉంటాయి. 1.5 కిలోమీటర్ల సర్వీస్ రోడ్ అందుబాటులోకి వస్తుంది. ఈ ట్రంపెట్‌లో 59 పియర్లు, 60 స్పాన్లు ఉంటాయి. ఇది భూమి నుంచి 26 మీటర్ల ఎత్తులో ఉంటుంది.

### కొత్వాల్‌గూడ ఎకోహిల్ పార్కు

హిమాయత్‌సాగర్ సమీపంలో 85 ఎకరాల్లో ఎకోహిల్‌పార్కును అభివృద్ధి చేశారు. ఇందులో దాదాపు 10 లక్షల మొక్కలు నాటారు. ఈ పార్కు హైదరాబాద్ నగరానికి గ్రీన్ లంగ్‌స్పేస్‌గా మారనుంది. దేశ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించే ఏర్పాట్లు చేశారు. ప్రపంచంలోనే 3వ అతిపెద్ద పక్షుల ఏవియరీ ఇక్కడ ఏర్పాటు చేశారు. 4.8 ఎకరాల విస్తీర్ణంలో 6,500 పక్షులకు ఆవాసంగా ఈ ఏవియరీ ఉంటుంది. పార్కులో 1.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ బోర్డ్ వాక్, 400 సీట్ల ఓపెన్ ఎయిర్ థియేటర్, సీతాకోక చిలుకల గార్డెన్, సెన్సరీ పార్కు, పిల్లల కోసం నేచురల్ ప్లే ఏరియా తదితర సదుపాయాలు ఉంటాయి. ఈ పార్కును సందర్శించడం వల్ల సింగపూర్‌లో పర్యటిస్తున్న అనుభూతి కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పార్కు ప్రారంభించిన అనంతరం ఆయన అందులో కలియతిరిగారు.

## ప్రాజెక్టుల నాణ్యతలో రాజీ పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. "దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేస్తే సరిపోతుందని నిపుణులు నివేదికలు ఇచ్చినా, నాణ్యత, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం" అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఝంఝావతి రబ్బర్ డ్యాం కొట్టుకుపోయిన ఘటనను గుర్తు చేస్తూ, నిర్మాణాల్లో నాణ్యతా లోపాలను సహించేది లేదన్నారు. తమ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పోలవరం-నల్లమల సాగర్ లింక్, వరికపూడిశెల లిఫ్ట్, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులపైనా ఈ సమీక్షలో చర్చించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీ నేతల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొత్తగా 'రప్పా రప్పా' రాజకీయం మొదలైందని, పరామర్శలకు, శుభకార్యాలకు వెళ్లి విధ్వంసం సృష్టించడం ఎక్కడి సంస్కృతి అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు, తిరుమల లడ్డూ వ్యవహారం, కూటమి ఎమ్మెల్యేల ప్రవర్తన, స్వర్ణాంధ్ర లక్ష్యాలపై సీఎం సుదీర్ఘంగా ప్రసంగించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చింది. ఒక నాయకుడు పర్యటన చేస్తే రప్పా రప్పా అంటున్నారు. అసలు పెళ్లికి వెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు చేస్తారా? భద్రత కోసం వచ్చిన ఎస్ఐ గాయపడినా కనీసం పట్టించుకోలేదు. గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకుని తిరిగే నాయకుడు దేశంలో ఎక్కడైనా ఉంటారా?" అని సీఎం ప్రశ్నించారు. కటౌట్లకు పొట్టేళ్ల రక్తంతో అభిషేకం చేయడం, నేరుగా హింసను ప్రోత్సహించడం ఫ్యాక్షనిజాన్ని తలపిస్తోందన్నారు. కేవలం 5 కిలోమీటర్ల దూరాన్ని వెళ్లేందుకు 6-7 గంటల సమయం తీసుకుంటూ, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ ప్రతిపక్షంలో ఉండి హెచ్చరికలు జారీ చేయడం దేశ చరిత్రలో ఏ పార్టీ చేయలేదని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టానికి కారకులైన వారే పరామర్శలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు.

## ఇది ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదు: హరీశ్ రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్ రావు విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాల పాటు పది రకాల కార్యక్రమాలంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ 'డైవర్షన్ ప్లాన్' రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్ లెస్' క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా.. వాస్తవానికి ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు.

## ఖమేనీ బంకర్ ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. రాజధాని టెహ్రాన్ నడొ'డ్డున దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీకి చెందిన రహస్య భూగర్భ బంకర్‌ను బాంబు దాడులతో తుత్తునియలు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. "రహస్య భేటీలతో పాటు యుద్ధం వంటి క్లిష్ట పరిస్థితుల్లో సమన్వయం, పర్యవేక్షణ తదితరాల కోసం ఖమేనీ ఈ బంకర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 50 యుద్ధ విమానాలతో దానిపై విరుచుకుపడ్డాం. నామరూపాల్లేకుండా ధ్వంసం చేసేశాం"అని ఇజ్రాయెల్ సైన్యం ఐడీఎఫ్ పేర్కొంది. ఖమేనీ హత్యానంతరం ఆ బంకర్ సీనియర్ కమాండర్లకు బేస్‌గా ఉపయోగపడుతున్నట్టు సమాచారం. గురువారం రాత్రంతా గుక్కతిప్పుకోకుండా జరిగిన దాడులతో టెహ్రాన్ అల్లాడిపోయింది. ఎక్కడ చూసినా భారీగా దుమ్ము, పొగ ఆకాశాన్నంటుతూ కన్పిస్తున్నాయి. కీలకమైన క్షిపణి నిల్వ కేంద్రాలున్న కెర్మెన్‌షాపైనా తీవ్రస్థాయిలో దాడులు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున అమెరికా బీ2 స్టెల్త్ బాంబర్ విమానాలు ఒక్కోటీ 2,000 పౌండ్ల బరువుండే పెనెట్రేటర్ బాంబులను డజన్ల కొద్దీ జారవిడిచాయి! అనంతరం ఉదయం వేళ టెహ్రాన్‌లో పలుచోట్ల భారీ పేలుళ్లు వణికించాయి. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 1,300 దాటినట్టు ప్రభుత్వం పేర్కొంది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపైనా దాడులను ఇరాన్ ముమ్మరంగా కొనసాగించింది. జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో ప్రజలు భారీ సంఖ్యలో బంకర్లలో తలదాచుకుంటున్నారు. ఖతర్, ఒమన్, బహ్రెయిన్, కువైట్, అజర్‌బైజాన్ తదితర దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగాయి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా దేశాల నుంచి ఇప్పటిదాకా 20 వేల మంది అమెరికన్లు స్వదేశానికి చేరుకున్నారు. యూఏఈలోని అల్ దాఫ్రా, కువైట్లోని అల్ సలేం వైమానిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. దోహాలోని గల్ఫ్ సహకార సమాఖ్య (జీసీసీ) తాలూకు యూనిఫైడ్ మిలిటరీ కమాండ్ భవనంపైనా దాడికి దిగింది! ఇరాన్ ప్రయోగించిన 9 బాలిస్టిక్ క్షిపణులతో పాటు 109 డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు యూఏఈ ప్రకటించింది. ఇరాక్‌లోని కుర్దిస్తాన్‌లో అమెరికాకు చెందిన ఒక చమురు క్షేత్రంపైనా ఇరాన్ దాడి చేసింది. దాంతో అక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. కుర్దు తెగ ఇజ్రాయెల్, అమెరికాలకు దన్నుగా యుద్ధానికి దిగితే ఇరాక్‌లోని కుర్దిస్తాన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడతానని ఇరాన్ హెచ్చరించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం దాడుల తీవ్రతను బాగా పెంచింది. దేశంలో ఇప్పటిదాకా మరణించినవారి సంఖ్య 123కు చేరినట్టు సమాచారం. రాజధాని బీరూట్, శివారు ప్రాంతాలను గాజా తరహాలో నేలమట్టం చేసేస్తామని ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ హెచ్చరించారు. దాంతో ఆ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా వలస వెళ్తున్నారు. ఇప్పటిదాకా 83 వేల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే సరిహద్దులు దాటి లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లింది. అంతర్జాతీయ సమాజం తమను ఆదుకోవాలని లెబనాన్ ప్రధాని నవాఫ్ సలాం విజ్ఞప్తి చేశారు.

## మన టాప్ ర్యాంక్ 23

(మొదటి పేజీ తరువాయి)

లభించాయి. ఈ మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శుక్రవారం తుది ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 1,087 పోస్టులు ఖాళీగా ఉండగా తుది ఫలితాల్లో 659 మంది పురుషులను, 299 మంది మహిళలను కలిపి మొత్తంగా 958 మందిని సివిల్స్ విజేతలుగా యూపీఎస్సీ ప్రకటించింది. టాప్ 25 ర్యాంకులు సాధించిన వారిలో 14 మంది పురుషులు ఉండగా 11 మంది మహిళలు ఉన్నారు. మొత్తం అర్హుల్లో 317 మంది జనరల్ కేటగిరీ వారుకాగా 306 మంది ఓబీసీలు, 158 మంది ఎస్సీలు, 73 మంది ఎస్టీలు, ఉన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన (ఈడబ్ల్యూఎస్) విభాగం నుంచి 104 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించారు. అలాగే ఐఏఎస్‌కు 180 మంది, ఐపీఎస్‌కు 150 మంది, ఐఎఫ్ఎస్‌కు 55 మంది, కేంద్ర సర్వీసుల (గ్రూప్‌ఏ)కు 507 మంది, గ్రూప్‌బీ సర్వీసులకు 195 మంది ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది. సివిల్స్ ప్రిలిమ్స్‌ను 5,76,793 మంది రాయగా 14,161 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వారిలో 2,736 మంది మాత్రమే ఇంటర్వ్యూ దశకు చేరుకున్నారు.

సివిల్స్2025 ఫలితాల్లో ఏపీ, తెలంగాణ అభ్యర్థుల సంఖ్య గతేడాదితో పోలిస్తే కొద్దిగా తగ్గింది. గతేడాది రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన గ్రూప్1 పరీక్షలకు సన్నద్ధత వల్ల అభ్యర్థులు సివిల్స్‌పై ఎక్కువ దృష్టి సారించలేకపోయారు. విజేతల్లో ఎ క్కువ శాతం మంది ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారు, సివిల్స్ రీఅటెంప్ట్ చేసిన వారే ఉన్నారు. తొలిసారి పరీక్ష రాసిన వారి సంఖ్య తక్కువగానే ఉంది.



# బడికి 'బాల' కలెక్టర్.. సందడి చేసిన చిట్టి గురువులు!

- పల్లివాడ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం

**రామన్నపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఒక రోజు పాటు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజా ప్రతినిధులుగా బాధ్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్, ఎంఆర్వో, డీఈఓ, ఎంఈఓ, సర్పంచ్, ఉపాధ్యాయులుగా పాత్రలు పోషించి అందరినీ ఆకట్టుకున్నారు. కలెక్టర్‌గా ఆవుల సీతు, ప్రధానోపాధ్యాయురాలిగా జటంగి స్వాతి, డీఈఓగా మాదాసు అక్షిత, ఎమ్మార్వోగా కుమార్, ఎంఈఓగా డి. రేష్మ, సర్పంచ్‌గా కంభంపాటి అక్షిత, ఎంసీటీసీగా సల్ల సలీం బాధ్యతలు నిర్వర్తించారు. ప్రధానోపాధ్యాయురాలిగా స్వాతి తన పాత్రతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. విద్యార్థులు తమ పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రజా ప్రతినిధులుగా చర్చించి పరిష్కార మార్గాలపై అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులు తమ కోసం చేసే కృషిని ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మునిపంపుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదిగి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నేడు పోషించిన పాత్రలను నిజ జీవితంలో కూడా సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఘాసీరాం, రఘురాం రెడ్డి, జయశ్రీ, నిర్మలాదేవి, పాల్వంచ హరికిషన్, కృష్ణయ్య, భూపాల్, లలిత, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

- మినీ అసెంబ్లీని తలపించిన పాఠశాల!
- రఘునాథపురంలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం
- బాధ్యతలు చేపట్టిన చిన్నారుల ప్రతిభ అమోఘం





**రాజపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలోని రఘునాథపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠశాల పరిపాలన బాధ్యతలు చేపట్టి కార్యక్రమాన్ని ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగ వెంకట నర్సమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, చిన్న గౌరాయపల్లి సర్పంచ్ భోగ లక్ష్మీనారాయణ, మండల విద్యాధికారి చందా రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులుగా దోర్నాల సహజ, పార్లమెంట్ సభ్యులుగా శెట్టి కార్తికేయ, శాసనసభ్యులుగా గొర్ల వరుణ్ తేజ్, కలెక్టర్‌గా శెట్టి సాయి తేజ, జిల్లా విద్యాశాఖ అధికారిగా బీతోజు బిందు, డిప్యూటీ విద్యాశాఖ అధికారిగా సామల గౌతమ్ కృష్ణ, మండల అభివృద్ధి అధికారిగా మ్యాక మైత్రి, మండల విద్యాధికారిగా ఎలగందుల ప్రణవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా వడ్లకొండ ప్రణీత, సర్పంచిగా పసుల దయాశంకర్ బాలాజీ, ఏఏపీసీ చైర్మన్‌గా భోగ సాత్విక బాధ్యతలు నిర్వర్తించారు. అదేవిధంగా డాక్టర్లుగా చెన్న సారిక, శెట్టి నవ్యశ్రీ, సీఆర్పీగా గౌరకంటి ప్రణవి, టీచర్లుగా ఉష, హర్షవర్ధన్, వేదశ్రీ, సిరి, శశాంక్, హారిక, నందిని, వర్షిని, నవదీర్ సింహ, శ్రీవాణి, లాభశ్రీ, వైష్ణవి, శిరీష, పీఈటీగా కొండం ప్రతీక్, గన్‌మెన్‌లుగా రిత్విక్ సాయి, మహావీర్, రోహిత్, పర్సనల్ అసిస్టెంట్లుగా అఖిల్, హర్షవర్ధన్, వరుణ్ తేజ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కలకుంట్ల కవిత, ఉపాధ్యాయులు సోమ సత్తిరెడ్డి, ఎలగందుల వెంకటేష్, జూకంటి కరుణాకర్, చింతకింది శ్రీనివాస్, కీర్తి సరిత, ఇండ్ల రామచందర్ తదితరులు పాల్గొన్నారు. తమ పాత్రలకు న్యాయం చేసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ చందా రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.





# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం
- నాగినేపల్లిలో గృహాల పరిశీలన

**బొమ్మలరామారం, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో వివిధ దశల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బొమ్మలరామారం మండలం నాగినేపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరైన మొత్తం ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య, వాటిలో పూర్తయినవి, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవి, ఇంకా ప్రారంభం కానివి తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను లబ్ధిదారులకు తక్కువ ధరలకు అందుబాటులో ఉంచి నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణం పూర్తయిన దశలకు అనుగుణంగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయా అని ఆరా తీశారు. వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తే చివరి బిల్లులు కూడా విడుదల అవుతాయని తెలిపారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గ్రామాల పరిశుభ్రతకు అందరూ తోడ్పడాలి

- నాగినేపల్లి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్
- ప్రతి కాలనీలో చెత్త లేకుండా గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని సూచన
- మురికి కాల్వలు, రోడ్ల పక్కనున్న చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశం
- త్రాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్, ప్రతి నెల శుభ్రపరిచే చర్యలు అవసరం
- మార్చి నెలలో ఇంటి పన్నులు పూర్తిగా వసూలు చేయాలని అధికారులకు సూచనలు



**బొమ్మలరామారం, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో గ్రామాల పరిశుభ్రతకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. శుక్రవారం బొమ్మల రామారం మండలం నాగినేపల్లి గ్రామంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామంలో చేపట్టిన పరిశుభ్రత పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రతి కాలనీలో చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలని, మురికి కాల్వలను శుభ్రం చేయడంతో పాటు రోడ్ల ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రమైన త్రాగునీటి సరఫరా కోసం నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని, వాటర్ ట్యాంకులను ప్రతి నెల శుభ్రపరచాలని సూచించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మార్చి నెల చివరి నెల కావడంతో ఇంటి పన్నులు వసూలు చేసి బకాయిలను పూర్తిగా క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ రాములు, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.









# ప్రజా పోరాటంతోనే నియోజకవర్గ సాధన

- రామన్నపేట నియోజకవర్గంగా పునర్వైభవం రావాలి
- సర్పంచ్, పాలకవర్గాన్ని సత్కరించిన రెబ్బాసు రాములు

**రామన్నపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణను రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ సాధన సమితి గౌరవ అధ్యక్షులు రెబ్బాసు రాములు నేతృత్వంలో ఉపసర్పంచ్ మోటే రమేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రెబ్బాసు రాములు మాట్లాడుతూ.. ఒకప్పుడు రామన్నపేట ప్రాంతం ఇబ్రహీంపట్నం నుంచి ఆలేరు వరకు, నల్గొండ నుంచి శాలిగౌరారం వరకు విస్తరించి సమితిగా ఉండేదని తెలిపారు. 1952 నుంచి 2009 వరకు రామన్నపేట నియోజకవర్గ కేంద్రంగా కొనసాగిందని గుర్తుచేశారు. అనంతరం నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా రామన్నపేటను నకిరేకల్ నియోజకవర్గంలో కలిపినట్లు చెప్పారు. రామన్నపేట ప్రత్యేక నియోజకవర్గం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో గత కొంతకాలంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో కలిసి రామన్నపేట నియోజకవర్గ సాధన సమితిని ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. రామన్నపేట నియోజకవర్గ సాధన సమితికి మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా సర్పంచ్ గరిక సత్యనారాయణను కోరారు. అనంతరం సర్పంచ్ గరిక సత్యనారాయణ సాధన సమితి గౌరవ అధ్యక్షులు రెబ్బాసు రాములను సన్మానించారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు గడ్డం యాదగిరి, బందెల అశోక్, ఎండి ఇమామ్ సాబ్, నకిరేకంటి నరేష్, పెండెం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు: వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్



**వలిగొండ, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదని వలిగొండ ఎస్ఐ యుగేందర్ గౌడ్ స్పష్టం చేశారు. మండలంలోని వేములకొండ గ్రామ సమీపంలో మూసీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేములకొండ గ్రామానికి చెందిన పులిపల్పుల శివ, మంటిపల్లి రమేష్‌లు గుట్టుచప్పుడు కాకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేయడమే కాకుండా, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సంపదను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# స్వచ్ఛ చౌటుప్పలే లక్ష్యం!




- అభివృద్ధి బాటలో పురపాలిక.. 99 రోజుల్లో మౌలిక వసతులే లక్ష్యం.
- జన చైతన్యమే ప్రధాన అజెండా
- ప్రతిజ్ఞ చేసిన కౌన్సిలర్లు, మున్సిపల్ పాలకవర్గం.
- ప్రజా పాలనతో మారనున్న వార్డుల రూపురేఖలు..
- చైర్‌పర్సన్ మొగుదాల పావని.

**చౌటుప్పల్, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక" (ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక)ను చౌటుప్పల్ పురపాలక సంఘంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి, కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా టీయూఎఫ్ఐడీసీ ఈఈ రవిశంకర్ హాజరయ్యారు. అలాగే ప్రజా నాయకులు మొగుదాల రమేష్ గౌడ్, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, దేప రాజు, ఊడుగు రమేష్ గౌడ్, చింతల సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. పట్టణాల సమగ్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సందేశంలో పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పట్టణ పరిశుభ్రత, అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని మాట్లాడుతూ.. అందరి సహకారంతో చౌటుప్పల్ పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో 'స్వచ్ఛ చౌటుప్పల్' లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిదేనని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మొదటి వార్డు కొసనం రాకేష్ రెడ్డి, రెండో వార్డు పోలేపల్లి లక్ష్మీ, మూడో వార్డు పల్లె లావణ్య, నాల్గో వార్డు ఊదరి యాదయ్య, ఐదో వార్డు కొయ్యడ శేఖర్, ఆరో వార్డు ఆలే శ్రీలత, ఏడో వార్డు కాసర్ల మంజుల, ఎనిమిదో వార్డు బద్రి గాలయ్య, పదో వార్డు దేప రమ్య, పన్నెండో వార్డు పాక చిరంజీవి, పదమూడో వార్డు బత్తుల వాణి, పద్నాలుగో వార్డు ఊడుగు జ్యోతి, పదిహేనో వార్డు గడ్డం ఇందిరా, పదహారో వార్డు బత్తుల జయమ్మ, పదిహేడో వార్డు చింతల ఉమామహేశ్వరి, పద్దెనిమిదో వార్డు బుడ్డ సురేష్, పంతొమ్మిదో వార్డు పిల్లలమర్రి మధుసూదన్, ఇరవయ్యో వార్డు హన్ను మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతిజ్ఞ కార్యక్రమం అనంతరం తంగడపల్లి 5వ వార్డులోని బ్రహ్మంగారి గుడి సమీపంలోని రోడ్లను శుభ్రపరిచి చెత్త కుప్పలను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య కూడా పాల్గొన్నారు. పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని చౌటుప్పల్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు.










## అభివృద్ధి పనులపై గ్రామ సభలో తీర్మానాలు

- రాజపేటలో గ్రామసభడ ప్రజా సమస్యలే అజెండాగా సమావేశం
- గ్రామ సమస్యలపై చర్చించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**రాజపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కోయ మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై గ్రామస్తులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సాయిలు, ఉపసర్పంచ్ నమిలా కేదారి గౌడ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు తీరనున్న లో-వోల్టేజీ కష్టాలు

- ధర్మోజిగూడెంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



**చౌటుప్పల్, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా తెలిపారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల వద్ద ఉన్న 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో లో వోల్టేజ్ సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి నూతనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారని చెప్పారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, రైతులు బత్తుల శ్రీహరి, ఐతరాజు సత్తయ్య, ఊదరి శంకర్, ఐతరాజు శ్రీనివాస్, రాచకొండ కృష్ణయ్య, కొంతం మాధవ రెడ్డి, కొంతం లక్ష్మారెడ్డి, ఐతరాజు శంకర్, పక్కీరు జయలక్ష్మి, కన్నెమోని సుగుణమ్మ, ఐతరాజు బక్కయ్య, కన్నెమోని శ్రీనివాస్, దాసరి శేఖర్, గునుగంటి బాలరాజు, దాచెపల్లి మనోహర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన వార్డు కార్యాలయం..

- కౌన్సిలర్ బాధ్యతల స్వీకరణ
- వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా..
- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను
- కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య

**చౌటుప్పల్, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మున్సిపాలిటీలో జరిగిన పురపాలక ఎన్నికల్లో విజయం సాధించిన 2వ వార్డు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య తాళ్లసింగారం ప్రాంతంలో తమ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి శుక్రవారం అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. వార్డు ప్రజలు తమపై విశ్వాసం ఉంచి విజయాన్ని అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్యను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మారుపాక నరసింహా, నల్ల అంజయ్య, భాజపా పుర ఉపాధ్యక్షుడు నల్ల శివప్రసాద్, నల్ల లింగస్వామి, ఎడ్ల జగన్, భాజపా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు

- చౌటుప్పల్ 14వ వార్డులో నూతన గృహ ప్రారంభోత్సవం
- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని

**చౌటుప్పల్, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేయడం ప్రభుత్వ లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ 14వ వార్డులో బత్తుల నరసింహ - సుశీల దంపతుల కుమార్తె బత్తుల ప్రశాంతి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ను శుక్రవారం చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు గృహాలు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాస్ గౌడ్, షాది ఖానా చైర్మన్ ఎండి కరీం, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, ఆవుల యేసు, ఎండి ఎజాస్, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ కోత్వాల్ గూడ లో ఎకో పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని కొత్వాల్ గూడ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఎకో పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసమే పనిచేస్తుందని తెలిపారు. బిఆర్ఎస్ బిజెపి పార్టీలు పనిగట్టుకుని ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను అడ్డుకొనే కుట్రలు చేస్తుందని దుయ్యబట్టారు. శంషాబాద్ ప్రాంతం ప్రపంచంలోని అభివృద్ధిని చెందిన నగరాలతో పోటీపడి స్థాయికి అభివృద్ధి జరుగుతుందని జోష్యం చెప్పారు. గుజరాత్ లోని సబర్మతి నదికి తీసుకొని విధంగా తెలంగాణలోని మూసినిదిని అభివృద్ధి చేసేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుంటే కొందరు దుష్టశక్తులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూసి నిర్వాసితులకు అన్యాయం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు మూసీ నదిలో చెత్త మురికి పేరుకుపోయిందని అలాంటి వాతావరణంలో ఉండాలని ఎవరు కోరుకోరని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మూసి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేసి వ్యాపారాలను విస్తరిస్తామని తెలిపారు. రాజేంద్రనగర్ కొత్వాల్ గూడ లో ఏకో పార్కును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి జరగాలంటే కొందరు భూమి కోల్పోవాల్సి ఉంటుంది. కానీ ఎవరికి అన్యాయం చేయం అందరితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



## గ్రామ సమస్యలకు సభలే పరిష్కారం

- జాల సర్పంచ్ గంధమల్ల నవనీత నరసింహులు

**రాజపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** గ్రామ సభల ద్వారా గ్రామ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని జాల గ్రామ సర్పంచ్ గంధ మల్ల నవనీత నరసింహులు అన్నారు. శుక్రవారం రాజపేట మండలంలోని జాల గ్రామంలో ఆమె అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను గ్రామ సభలో గుర్తించి వాటిని త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ ప్రజలు సమస్యలను గ్రామ సభలోనే వెల్లడించి పరిష్కారం పొందాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొల్లూరి లావణ్య కరుణాకర్, వార్డు సభ్యులు కొన్యాల పరమేశ్వర్ రెడ్డి, ముత్యం రెడ్డి, బాలయ్య, ధనమ్మ, దొమ్మాట లక్ష్మి, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## చీపురు పట్టిన తహసీల్దార్

- రాజపేట తహసీల్దార్ ఆఫీసులో క్లీన్ అండ్ గ్రీన్
- ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాల పరిశుభ్రత





**రాజపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ వల్లపు ప్రదీప్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది చీపురు పట్టి పరిసరాల్లోని చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పిచ్చి మొక్కలను కూడా తీసివేశారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వల్లపు ప్రదీప్ మాట్లాడుతూ.. పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింలు, జిపిఓ గణేష్, సుదర్శన్, ఎల్లయ్య, కవిత, ఉపేంద్ర, లక్ష్మి, మహాలక్ష్మి, రాజశేఖర్, శ్రీను, ఆనందు, శ్రీనివాసులు, రాజశేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి క్షేత్రంలో అన్నదాతల ఉదారత

- శ్రీవారి అన్నదానానికి లక్ష రూపాయల విరాళం
- నిత్య అన్నదానానికి ఏపీ దంపతుల సహాయం

**యాదగిరిగుట్ట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా వేట్లపాలెం గ్రామానికి చెందిన అమ్మటం శైలేంద్రనాథ్ – పద్మావతి దంపతులు దేవస్థానం అన్నదాన కార్యక్రమానికి రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం ఏఈఓ రఘుకు భక్తులు అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ రఘు మాట్లాడుతూ.. స్వామివారి ఆలయంలో ప్రతిరోజూ అన్నదాన ప్రసాదంలో కనీసం వెయ్యి మందికి భోజన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమంలో అనేక మార్పులు తీసుకువచ్చినందున భక్తులు విరాళాలు ప్రకటిస్తూ సహకరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో భక్తులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. స్వామివారి సేవలో భాగంగా భక్తులు విరాళాలు అందించడం ఆనందకరమని ఆయన తెలిపారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఘనంగా ప్రజాపాలన కార్యక్రమాలు
- సమ్మర్‌లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు
- రెసిడెన్షియల్ పాఠశాలల్లో తాగునీటి సదుపాయం
- కాలుష్య నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు
- పంట మార్పిడి 30 శాతం అమలు చేయాలి
- పేదలకు నాణ్యమైన విద్యా, వైద్య సేవలు
- గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం
- రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన అవసరం
- పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం
- "అధికారులు ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడే ప్రజల సమస్యలు పూర్తిగా తెలుసుకుని పరిష్కరించగలుగుతారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి

**మెదక్, (తొలివెలుగు న్యూస్) :** అధికారులు ప్రజలతో మమేకమై పనిచేయాలని, 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రికి మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవీణ్య, సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీస్ గౌరవ వందనం స్వీకరించి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చారని, దీన్ని సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమ్మర్ సీజన్‌లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రిపేర్లు, బోర్లు తదితర అవసరాలపై ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వాటిపై అసెంబ్లీలో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల వల్ల కాలుష్యం పెరగకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలని అన్నారు. గుమ్మడిదలలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, సోలార్ సూర్య ఘర్ యోజన పథకం అమలు, ఏటీసీ నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా టీజీఐఐసీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పంట మార్పిడి విధానాన్ని కనీసం 30 శాతం అమలు చేయాలని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్య, వైద్యం అత్యంత ముఖ్యమని, పేద ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్ కార్డులు, డిజిటల్ హెల్త్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ... ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. దుబ్బాకలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని, కొత్త మండలాల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షా 25 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చే సమయంలో రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కల్పించాలని రవాణా శాఖకు సూచించారు. పరిశ్రమలు, నిర్మాణాలు, రహదారుల వల్ల కాలుష్యం తగ్గేలా చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి డీజిల్ తయారీకి ముందుకొచ్చిన స్వచ్ఛంద సంస్థకు సిద్దిపేటలో అర ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ పరీక్షలు నిర్వహించాలని, వైద్య పోస్టులను భర్తీ చేసి డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారులను త్వరగా మరమ్మతు చేయాలని కోరారు. ఎంఎల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని, వాహనాలు అధికంగా నడిచే ప్రాంతాల్లో అండర్ పాస్ నిర్మించాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంట సాగు పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలని, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఓపీ ఫీజులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, పాల ఉత్పత్తి పెంచే చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రోబోటిక్ వైద్యం.. మోకాలి నొప్పికి చరమగీతం!




- ఆపరేషన్ చేసిన రోజే నడక ప్రారంభం
- యశోద వైద్యుల అరుదైన ఘనత
- శస్త్రచికిత్స చేసిన రోజే నడిచిన 78 ఏళ్ల వృద్ధురాలు
- యశోద ఆస్పత్రి నిపుణుడు ద డాక్టర్ విక్రమ్ భైరి వెల్లడి

**యాదాద్రి భువనగిరి, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో అరుదైన రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆర్థోపెడిక్ సర్జన్, రోబోటిక్ జాయింట్ నీ రీప్లేస్మెంట్ నిపుణుడు డాక్టర్ విక్రమ్ భైరి తెలిపారు. ఈ విషయాన్ని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న సంకల్ప్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మోకాళ్ల నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్న 78 ఏళ్ల రాజలక్ష్మి అనే మహిళకు రోబోటిక్ జాయింట్ నీ రీప్లేస్మెంట్ శస్త్రచికిత్స నిర్వహించామని, అదే రోజు సాయంత్రానికే ఆమె నడిచినట్లు డాక్టర్ విక్రమ్ భైరి తెలిపారు. శస్త్రచికిత్సకు ఐదు నెలలు పూర్తయ్యాయని, ఈ కాలంలో ఆమెకు ఎలాంటి కాళ్ల, కీళ్ల నొప్పులు లేకుండా మునుపటి కంటే మెరుగ్గా నడవగలుగుతున్నారని చెప్పారు. తన వద్దకు వచ్చే రోగులకు మోకాళ్ల నొప్పులకు సంబంధించి శాతానికి శాతం ఉపశమనం కలిగేలా అత్యాధునిక చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఫిజియోథెరపీ చేయించుకోవడం ఎంతో ముఖ్యమని, అలాగే పాజిటివ్ మైండ్‌తో ఒత్తిడిని తగ్గించుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని సూచించారు. శస్త్రచికిత్స చేయించుకున్న రాజలక్ష్మి మాట్లాడుతూ.. మోకాళ్ల నొప్పుల కారణంగా నడవడం కూడా కష్టంగా మారిందని, ప్రతి అడుగులోనూ తీవ్ర నొప్పి అనుభవించాల్సి వచ్చేదని తెలిపారు. అనంతరం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో డాక్టర్ విక్రమ్ భైరిని సంప్రదించి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎలాంటి నొప్పులు లేకుండా సాధారణంగా నడుచుకుంటూ అన్ని పనులు చేసుకుంటున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యశోద ఆస్పత్రి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి, సీనియర్ మేనేజర్ వెంకట్, ఎగ్జిక్యూటివ్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## ట్విట్టర్‌లో ఫిర్యాదు చేస్తే గానీ కదలని అధికారులు

- అంబేద్కర్ కాలనీలో ఉప్పొంగిన డ్రైనేజీ ఇళ్లలోకి మురుగు నీరు
- ఎండీఆర్ ఫౌండేషన్ ట్వీట్‌తో స్పందించిన అధికారులు
- తాత్కాలిక పరిష్కారం మాత్రమే శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే సమస్యకు కారణమంటున్న కాలనీవాసులు

**పటాన్‌చెరు, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ ఉప్పొంగి రోడ్డుపైకి, ఇళ్లలోకి ప్రవహిస్తున్న సమస్యపై స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదని కాలనీవాసులు తెలిపారు. ఈ సమస్యపై స్థానికులు చేసిన ఫిర్యాదును ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు ట్విట్టర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే సిబ్బందిని పంపించి డ్రైనేజీ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. అయితే ఈ సమస్య తరచూ వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గతంలో డ్రైనేజీ పనులు చేపట్టేటప్పుడు సరైన స్థాయిలను పరిశీలించకుండా పనులు చేయడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎండీఆర్ ఫౌండేషన్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయిలో మెరిసిన చేనేత కళాకారిణి

- మాదురి హరితను సత్కరించిన బీజేపీ నేతలు
- హాజరైన రామచంద్రరావు, డీకే అరుణ
- రఘునాథపురం గ్రామంలో హర్షాతిరేకాలు

**రాజపేట, మార్చి 6 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన నేత కార్మికురాలు మాదురి హరితకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. గ్రామీణ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ స్వయంగా చీరలు నేస్తూ తన ప్రతిభను చాటుకుంటున్న హరిత సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో సత్కరించారు. హైదరాబాద్ సోమాజిగూడలోని హోటల్ కత్రియాలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, బీజేపీ జాతీయ నాయకురాలు డీకే అరుణ, ఢిల్లీ ఎంపీ బన్సల్ స్వరాజ్ లు హరితను సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధురి చంద్ర మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కనబరుస్తున్న అనిముత్యాలను గుర్తించి సన్మానించడం గర్వకారణమని తెలిపారు. రఘునాథపురం గ్రామానికి చెందిన మాదురి హరిత స్వయంగా చీరలు నేస్తూ తన ప్రతిభను చాటుకుంటుండటం అభినందనీయమని అన్నారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్న మౌంటనీర్ పడమటి అన్విత రెడ్డిని కూడా రాష్ట్ర మహిళా మోర్చా సన్మానించడం యాదాద్రి భువనగిరి జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరిండ్ల లక్ష్మి, లక్కాకుల మాధవి, శేషత్వం అర్చన, సకినాల స్వాతి, తోటకూరి మహాలక్ష్మి పాల్గొన్నారు.



# అభిమానుల కోసం పవన్ ముందుకొచ్చాడు..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ డైరెక్ట్ చేయడంతో ఈ మూవీపై అంచనాలు నెక్స్ట్ లెవెల్‌లో క్రియేట్ అయ్యాయి. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ మూవీపై హైప్‌ను పెంచాయి. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో మేకర్స్ తాజాగా ఓ నిర్ణయం తీసుకున్నారు. తొలుత మార్చి 26, 2026న ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని మేకర్స్ వెల్లడించారు. కానీ, ఇప్పుడు మార్చి 19న ఉగాది కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి సంబంధించిన టికెట్ రేట్ల విషయంపై ఇప్పుడు అందరి చూపు ఉంది. తెలంగాణ ప్రభుత్వం టికెట్ రేట్ల పెంపుకు నో చెబుతుండటంతో ఈ సినిమా టికెట్ రేట్లు ఎలా ఉండబోతున్నాయా అనే ఆసక్తి నెలకొంది. అయితే, ఏపీలో మాత్రం ఉస్తాద్ భగత్ సింగ్ చిత్ర టికెట్ రేట్ల పెంపు ఖాయంగా కనిపిస్తోంది. ఏదేమైనా ఈ చిత్ర టికెట్ రేట్ల విషయంపై ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. మరి ఈ సినిమాకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ రేట్ల పెంపుకు అనుమతి ఇస్తుందా లేదా అనేది వేచి చూడాలి.





రియా చక్రవర్తి



# మరో ప్రయోగానికి అడివి శేష్ రెడీ..

టాలీవుడ్ హీరో అడివి శేష్ తన కెరీర్ విషయంలో చాలా క్లారిటీగా ఉంటాడు. అందుకే ఆయన ఏ సినిమా చేసినా అది బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంటుంది. స్క్రిప్ట్ వర్క్ కోసం ఎక్కువ సమయం కేటాయించే ఆయన, ప్రస్తుతం 'డెకాయిట్' మరియు 'గూఢచారి 2' వంటి ప్రతిష్టాత్మక చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, అడివి శేష్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్‌తో ఒక కొత్త ప్రాజెక్ట్ గురించి చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. 'చి ల సౌ' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాహుల్ రవీంద్రన్, ఆ తర్వాత 'మన్మథుడు 2' మరియు విమర్శకుల ప్రశంసలు పొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలను తెరకెక్కించాడు. ప్రస్తుతం రాహుల్ రెండు కొత్త స్క్రిప్ట్‌లను సిద్ధం చేసుకోగా, అందులో ఒక కథను అడివి శేష్‌కు వినిపించాడు. ఈ నేరేషన్ శేష్‌కు బాగా నచ్చినప్పటికీ, తన ప్రస్తుత కమిట్‌మెంట్స్ వల్ల డేట్స్ కేటాయించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు రాహుల్ రవీంద్రన్ త్వరలోనే దీక్షిత్ శెట్టి హీరోగా ఒక సినిమాను ప్రారంభించనున్నాడు. ఈ ఏడాదిలోనే ఆ సినిమా షూటింగ్ మొదలుకానుంది. అడివి శేష్ తన ప్రాజెక్ట్‌ల నుండి ఫ్రీ అయ్యేలోపు రాహుల్ దీక్షిత్ శెట్టి సినిమాను పూర్తి చేస్తాడు. అన్నీ కుదిరితే రాహుల్ రవీంద్రన్ మరియు అడివి శేష్ కాంబినేషన్‌లో ఒక ఆసక్తికరమైన సినిమా వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియాల్సి ఉంది.

# చిరు 158 ఏప్రిల్‌లో షురూ?

'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఇటీవలే ఈ సినిమా 50రోజుల్ని పూర్తి చేసుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో చిరంజీవి తదుపరి సినిమా ఎప్పుడు సెట్స్‌మీదకు వెళ్తుందోనని ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి తన నెక్స్ట్ ప్రాజెక్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. మెగాస్టార్ 158 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించనున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్తుందని భావించారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్ ఆలస్యమవుతూ వచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఏప్రిల్ 14 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రియమణి, అనురాగ్ కశ్యప్ ఈ సినిమాలో కీలక పాత్రల్ని పోషించనున్నారు. ఈ చిత్రానికి 'కాకా' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.



# యుద్ధ సన్నివేశాల్లో దెబ్బలు తగిలాయి

అందంతోపాటు అభినయపరంగానూ ప్రేక్షకుల అభినందనలందుకుంటున్నది మలయాళ మందారం సంయుక్త మీనన్. ఆమె నిఖిల్‌కి జోడీగా నటించిన పానిండియా సినిమా 'స్వయంభు' ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ చారిత్రాత్మక చిత్రంలో సంయుక్త యువరాణిగా కనిపించనున్నది. ఈ పాత్రకోసం కత్తిసాము, కర్రసాము తదితర యుద్ధ విద్యాలతోపాటు గుర్రపు స్వారీని కూడా నేర్చుకున్నది సంయుక్త. ఈ పాత్ర గురించి సంయుక్త మీనన్ మాట్లాడుతూ ' 'స్వయంభు' ఓ కొత్త ప్రపంచం. ప్రేక్షకుల్ని కొన్ని శతాబ్దాల వెనక్కి తీసుకెళ్లే సినిమా ఇది. ఇందులో నేను యోధురాలిగా కనిపిస్తా. ఈ సినిమా కోసం భయంకరమైన యుద్ధ సన్నివేశాల్లో నటించా. ఈ క్రమంలో దెబ్బలు కూడా తగిలాయి. కానీ స్క్రీన్‌పై నా కష్టాన్ని చూసుకున్నాక బాధలన్నీ మరిచిపోయా. ఇందులో నేను పోషించిన యువరాణి పాత్రను దర్శకుడు భరత్‌కృష్ణమాచార్య అద్భుతంగా మలిచారు. ఈ సినిమా తర్వాత ఆయన గొప్ప స్థాయిలో ఉంటారు. నిఖిల్‌తోపాటు మా అందరి కెరీర్లకూ ఈ సినిమా ఓ మైలురాయిలా నిలుస్తుంది' అని నమ్మకం వెలిబుచ్చింది సంయుక్త మీనన్. రామ్‌చరణ్ పానిండియా సినిమా 'పెద్ది'లో కూడా కథను మలుపుతిప్పే ఓ కీలక పాత్రలో సంయుక్త నటించినట్టు వార్తలొస్తున్నాయి. దీనిపై అధికారిక

